## క్లుప్తంగా

### అర్హులందరూ ఓటర్లుగా నమోదు కావాలి




ఓటరు నమోదు వివరాలను తెలుసుకుంటున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ

**మునగపాక:** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ కోరారు. ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం ఆమె మండలంలోని అరబుపాలెంలోని 133,134 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓటరు నమోదుకు సంబంధించిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ డ్రైవ్‌పై మరింత అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, రీ-సర్వే డీటీ పడాల్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

### కొనసాగిన పైపులైన్ మరమ్మతు పనులు

నేడు కూడా నీటిసరఫరాకు పాక్షికంగా అంతరాయం



పురుషోత్తపురం వద్ద దెబ్బతిన్న పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

**యలమంచిలి రూరల్:** పట్టణానికి ప్రధాన నీటి వనరుగా ఉన్న సోముదేవపల్లి హెడ్ వాటర్ వర్క్స్ పైపులైన్ దెబ్బతినడంతో మూడు రోజులుగా యలమంచిలి పట్టణానికి నీటి సరఫరా నిలిచిపోయింది. శనివారం కూడా పైపులైన్ మరమ్మతు పనులు కొనసాగాయి.ఈ కారణంగా యలమంచిలితో పాటు 16 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయినట్టు గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది తెలిపారు. పులపర్తి, లక్కవరం, పురుషోత్తపురం,రేగుపాలెం, లైనుకొత్తూరు, సోమన్నపాలెం గ్రామాలకు కూడా నీటి సరఫరా జరగకపోవడంతో వేలాది మంది తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. కార్తీక మాసంలో కనీసం స్నానాలు చేయడానికి కూడా అవకాశం లేకుండా చేశారని పులపర్తికి చెందిన మహిళలు వాపోయారు. పైపులైన్ మరమ్మతు పనులు పూర్తయినవెంటనే నీటి పంపింగ్ ప్రారంభించనున్నట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఆదివారం కూడా నీటి సరఫరా పాక్షికంగానే ఉంటుందని అధికారులు చెప్పారు.

### ర్యాష్ డ్రైవింగ్‌పై పోలీసుల ప్రత్యేక డ్రైవ్

ఏడు వాహనాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

**యలమంచిలి రూరల్:** ర్యాష్ డ్రైవింగ్‌తో పేట్రేగిపోతున్న యువకులకు పోలీసులు గట్టి షాకిచ్చారు. శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పట్టణ పరిధిలో వివిధ ప్రాంతాల్లో సీఐ ధనుంజయరావు నేతృత్వంలో పట్టణ పోలీసులు ప్రత్యేకడ్రైవ్ నిర్వహించారు.ప్రధాన రహదారి,రైల్వేస్టేషన్ రోడ్డు,ఆర్టీసీ బస్ కాంప్లెక్స్, ఇతర అంతర్గత రద్దీ రహదారుల్లో నిర్వహించిన తనిఖీల్లో ద్విచక్రవాహనాలతో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న పలువురు యువకులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి ఏడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారికి రూ.3,500 జరిమానా విధించారు. పట్టణంలో కొందరు యువకులు స్పోర్ట్స్ బైక్‌లతో మితిమీరిన వేగంగా దూసుకుపోతున్నారు. పాదచారులు,రోడ్లపైవెళ్లే సైక్లిస్టులు,ఇతర వాహన చోదకులు హడలిపోతున్నారు.తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలన్నీ 200సీసీ, 250 సీసీ సామర్థ్యం ఉన్నవే.ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న యువకులకు స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద సీఐ ధనుంజయరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని లేకపోతే కేసులు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ,పోలీసుసిబ్బందిపాల్గొన్నారు.



# నలుగురితో నాలుగడుగులు

- రోజూ గంట నడకతో ఆరోగ్యం పదిలం
- పట్టణంలో పెరిగిన వాకర్లు
- మారుతున్న జీవన శైలితో నడకకు పెరుగుతున్న ప్రాధాన్యం
- యలమంచిలి పట్టణంలో వాకర్స్ క్లబ్ ఏర్పాటు



పట్టణంలో వాకింగ్ చేస్తున్న యువతులు



యలమంచిలి పట్టణంలో ఉదయాన్నే వాకర్లు ఇలా..

**యలమంచిలి రూరల్:** ఉరుకులు,పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ ఒత్తిళ్లకు లోనవుతారు.చదువుతో విద్యార్థులు,పోటీ పరీక్షలతో నిరుద్యోగులు,ఇంటి పనులతో గృహిణులు,విధి నిర్వహణలో ఉద్యోగులు,లావాదేవీల విషయంలో వ్యాపారులు..ఇలా అన్ని వర్గాల వారు ఒత్తిడితో లోనవుతున్నారు.నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ప్రశాంతత ఏ కోశాన ఉండడంలేదు.దీంతో చాలా మంది అనారోగ్యానికి గురవుతున్నారు. ఊబకాయం,బీపీ, చక్కెర వ్యాధి బారిన పడుతున్నారు.వయసుతో సంబంధం లేకుండా గుండెపోటుకు గురవుతున్నారు. ఇటువంటివారు క్రమం తప్పకుండా మందులు వాడడంతో పాటు రోజుకు కనీసం 40 నిమిషాలు నడవాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో జనం నిత్యం ఉదయం,సాయంత్రం వేళల్లో నాలుగడుగులు వేస్తున్నారు.

అనారోగ్యంతో డాక్టరు వద్దకు వెళితే ముందుగా వాకింగ్‌కు వెళుతున్నారా అని అడిగిన తర్వాతే మిగిలిన విషయాలు మాట్లాడతారు. దీన్ని బట్టి నడకకు ఎంత ప్రాధాన్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. రెండు దశాబ్దాల క్రితం వరకు నగరాల్లో ఉండే పార్కులు,కళాశాల మైదానాల్లో ఉదయం నడిచేవారు. అదీ ఆర్థిక స్థితి మంతులు, పెద్ద పెద్ద ఉద్యోగులు మాత్రమే. ప్రస్తుతం కాలం మారింది.. అవకాశం ఉన్న ప్రతి చోటా నలుగురు కలిసి నడిచేందుకు ప్రయత్నించడంతో యలమంచిలి పట్టణంలో వీరి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది.పట్టణంలోని రాజీవ్ క్రీడా మైదానం,కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం పక్కనున్న చెరువు గట్టు,రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం,పాత జాతీయ రహదారి,అచ్యుతాపురం బైపాస్ రోడ్డు,చుట్టుపక్కల గ్రామాల్లో వివిధ ప్రాంతాల్లో రోజువారీ నడిచే సంఖ్య దాదాపు 600 వరకు ఉంటుంది.ఆయా ప్రాంతాల్లో ఉదయం నాలుగున్నర నుంచే వాకింగ్ చేస్తుంటారు.నడిచే వారిలో పురుషులతో పాటు మహిళలు కూడా ఉంటున్నారు.నడక అనంతరం చిన్న చిన్న వ్యాయామాలు సైతం చేస్తూ కొన్ని దీర్ఘకాలిక రోగాల నుంచి ఉపశమనం పొందుతున్నామని పలువురు తెలిపారు.ఇటీవల వాకింగ్‌కు ప్రాధాన్యత పెరగడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న వారు కూడా నడకను తమ దినచర్యలో భాగం చేసుకుంటున్నారు.

**వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు**

నడక ప్రయోజనాన్ని గుర్తించి క్రమంగా నడక చేసే వారి సంఖ్య పెరగడంతో యలమంచిలి పట్టణంలో ఇటీవల కొందరు విశ్రాంత ఉద్యోగులు వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు.వీరంతా నడక ప్రయోజనాలను వివరిస్తూ నిత్యం వాకింగ్ చేయాలని సూచిస్తున్నారు. అనువైన చోట వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.బస్టాండు పక్కనున్న కొమ్మాయిగుండం చెరువు సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.85 లక్షలతో చేపట్టిన చెరువు సుందరీకరణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయిన సంగతిని వాకర్లు గుర్తు చేస్తున్నారు. వెంటనే ఈ పనులు పూర్తి చేయాలని వారంతా కోరుతున్నారు.

### తప్పనిసరిగా నడుస్తాం



నలుగురితో కలిసి నడవడం వల్ల ఎంతో ఆనందం,ఉల్లాసంగా ఉంటుంది. కలిసి నడుస్తూ నాలుగు విషయాలు మాట్లాడుకుంటాం.నడక ప్రయోజనం తెలిసిన వారంతా ప్రతి రోజూ క్రమం తప్పకుండా వాకింగ్‌కు వస్తున్నారు. వర్షం పడితే గొడుగు పట్టుకుని వాకింగ్‌కు వస్తాం.భారీ వర్షం కురిస్తే ఇంటి దగ్గరే నడుస్తాం

– వి.ఆనంద్, గ్రంథాలయాధికారి,యలమంచిలి



కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం పక్కనున్న చెరువు గట్టుపై నడుస్తున్న సీనియర్ సిటిజన్లు

### దినచర్యలో భాగమైంది



వాకింగ్ దినచర్యలో భాగమైంది.ఐదేళ్లుగా రోజూ వాకింగ్ చేస్తున్నా.కోవిడ్ తర్వాత నడకకు అందరూ ప్రాధాన్యమిస్తున్నారు.వైద్యులు కూడా ప్రతి రోజూ నడవాలని చెబుతున్నారు.ప్రతి రోజూ ఉదయాన్నే ఆహ్లాదకర వాతావరణంలో నడవడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది.

–ఎ.వి.హెచ్.శాస్త్రి,ప్రధానోపాధ్యాయుడు, యలమంచిలి

### నడకతో ఉల్లాసం



రోజూ వాకింగ్ చేస్తే మనసు ఉల్లాసంగా ఉంటుంది.ఏదైనా పరిస్థితుల్లో నడవలేకపోతే ఆ రోజు ఏదో కోల్పోయిన ఫీలింగ్ కలుగుతుంది.అందుకే రోజూ తప్పనిసరిగా గంట సేపు వాకింగ్‌కు వెళుతుంటాను.ఆ తర్వాత కొన్ని ఆసనాలు వేస్తాను.మా బృందంలో అందరూ వాకింగ్‌ను అలవాటు చేసుకున్నారు.మమ్మల్ని చూసి మరికొంత మంది నడకకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

– లింగంపల్లి బాబూరావు, వ్యాపారి,యలమంచిలి

### మనసు ప్రశాంతంగా ఉంటోంది



నడక వల్ల మనసు ప్రశాంతంగా ఉంటోంది.పదేళ్లుగా వాకింగ్ చేస్తున్నాను.రోజుకి కనీసం 40 నుంచి 60 నిమిషాలు నడుస్తాను.నడక వల్ల కలిగే ప్రయోజనాలను మేము మరికొంతమందికి వివరిస్తున్నాం.దీంతో నడిచే వారి సంఖ్య పెరుగుతోంది.ప్రతి ఒక్కరూ నడవడం అలవాటు చేసుకోవాలి.దీని వల్ల రోగాలు దరిచేరవు.

–మడుగుల సూర్య సత్యనారాయణ, యలమంచిలి

## నీటి సంప్ క్లీనింగ్



కొత్త ఎర్రవరం వద్ద నీటి సంపును శుభ్రపరుస్తున్న మున్సిపల్ సిబ్బంది

**యలమంచిలి రూరల్:** పట్టణానికి నీటి సరఫరా పంపింగ్ చేసే నీటి సంప్‌ను శనివారం మున్సిపల్ సిబ్బంది శుభ్రపరిచారు.ఎన్నో ఏళ్లుగా ఈ సంప్ క్లీనింగ్ సక్రమంగా జరగడంలేదు.పురుషోత్తపురం సమీపంలో నీటి సరఫరా చేసే పైపులైను మరమ్మతుకు గురికావడంతో మూడురోజులుగా యలమంచిలి సహా పరిసర గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోవడంతో ఎర్రవరం వద్ద వాటర్ సంప్‌లో నీటి నిల్వలు లేవు.దీంతో శనివారం సంపును శుభ్రపరిచే పనిని చేపట్టారు.క్లీనింగ్‌లో భాగంగా ఏళ్ల తరబడి పేరుకుపోయిన వ్యర్థాలు,చెత్త,కర్రలు,ఇతర ప్లాస్టిక్ వస్తువులను తొలగించి సంపును బ్లీచింగ్ పౌడర్ తో శుభ్రపరిచారు.నీటి సరఫరా నిలిచిపోవడంతో సంపు క్లీనింగ్‌కు మోక్షం కలిగినట్టయింది.మున్సిపల్ ఇంజినీర్లు, సూపర్‌వైజర్లు ఈ పనిని పర్యవేక్షించారు.

## భారీ ఎత్తున అన్న సమారాధన



ఆలయంలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

**ఎస్.రాయవరం:** మండల కేంద్రం ఎస్.రాయవరంలోని శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన వారాంతపు అన్న సమారాధనలో ప్రసాదం స్వీకరించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.తాడేల వెంకటరమణ కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాలనుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు, ఆలయ నిర్వాహకులు బొలిశెట్టి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన రిమ్‌జిమ్ వేడుకలు



రిమ్‌జిమ్‌లో పాల్గొన్న విద్యార్థులు

**పాయకరావుపేట:** శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న రిమ్ జిమ్ – 2024 వేడుకలు ఘనంగా ముగిశాయి. తుని, పాయకరావుపేట, అన్నవరం ప్రాంతాలకు చెందిన సుమారు 4,500 మంది శ్రీ ప్రకాష్ విద్యార్థులకు జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాల్లో 29 అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు అతిథులుగా విచ్చేసిన లీఫైస్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ హోల్‌టైం డైరెక్టర్ ఎం.వి.రామకృష్ణ, డెక్కన్ ఫైన్ కెమికల్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.బంగారు బాబు, 6వ ఆంధ్రా నావెల్ ఎన్‌సీసీ కమాండర్ ఆఫీసర్ లెఫ్టినెంట్ సీడీఆర్ అక్షయ్ అరుణ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకునే అవకాశాన్ని పిల్లలకు తల్లిదండ్రులు కల్పించాలని సూచించారు. పరిపూర్ణమైన ఆరోగ్యం ఆటల ద్వారానే సాధ్యమవుతుందని, విద్యార్థులు తమ దైనందిన జీవితంలో ఆటలను కూడా ఒక భాగం చేసుకోవాలని చెప్పారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ప్రతిభ ఉంటుందని, దానిని వెలికితీసి, వారిని ఉన్నత స్థానానికి తీసుకువెళ్లడానికి కావలసిన మనోధైర్యం ఇటువంటి పోటీల ద్వారా లభిస్తుందని చెప్పారు. అనంతరం అతిథులకు జ్ఞాపికలు బహూకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్. మూర్తి, రిమ్ జిమ్ కన్వీనర్ ప్రసూనమౌళి తదితరులు పాల్గొన్నారు.



అతిథులకు జ్ఞాపికలు అందజేసిన విజయ్ ప్రకాష్

## వందరోజులు పూర్తయిన వారికి పనులు కల్పించాలి



ఉపాధి పనులు జరిగే చోట కూలీలు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీటీసీ మధు

**నక్కపల్లి:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వందరోజులు పూర్తయినవారికి కూడా పనులు కల్పించాలని స్థానిక ఎంపీటీసీ కుంచా మధు కోరారు. వేంపాడులో ఇలా చాలామంది కూలీలకు పనులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఉపాధి పనులు కల్పించాలని శనివారం వీరంతా అధికారులను కోరారు. అయితే మీకు వందరోజుల పూర్తయ్యాయి పనులు కల్పించడానికి కుదరదని అధికారులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎంపీటీసీ కుంచా మధు పనులు జరిగే ప్రాంతానికి వెళ్లారు. వారికి పనులు కల్పించకపోతే వాళ్లు ఎలా బతుకుతారని, ప్రస్తుతం వేరొక పనులకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, వందరోజులు పూర్తయిన వారికి కూడా పనులు కల్పించాలని అధికారులను కోరారు. పనులు పర్యవేక్షించేందుకు వచ్చిన ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో మాట్లాడారు. జాబ్‌కార్డుకలిగినవారందరికీ పనులు కల్పించాలన్నారు. ఉన్నతాధికారులకు ఇక్కడ పరిస్థితిని వివరించాలని సూచించారు.

## రోడ్డు విస్తరణకు సహకరించాలి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ

**మునగపాక:** పూడిమడక రోడ్డు విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ కోరారు. రహదారి విస్తరణ బాధితుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామన్నారు. మునగపాక పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం విస్తరణ బాధితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారి విస్తరణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రమాదాల నివారణతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి రహదారి విస్తరణ అవసరమని తెలిపారు.అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు రహదారిని వంద అడుగుల మేర విస్తరించేందుకు ఇప్పటికే అందరి అమోదం తీసుకున్నట్టు చెప్పారు. బాధితులకు మెరుగైన పరిహారం అందిస్తామన్నారు. ఇందుకు బాధితులు కూడా సహకరించాలని కోరారు. రెండేళ్ల క్రితం నిర్ణయించిన ధర కాకుండా పెరిగిన భూముల ధరలను దృష్టిలో పెట్టుకుని పరిహారం పెంచేలా చూడాలని కొందరు కోరారు. సమస్యను కలెక్టర్ విజయకృష్ణన్ దృష్టికి తీసుకువెళతామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీటీ శేషుబాబు,పెద్దలు పొలిమేర గణేష్, ఎ.వి.సత్యనారాయణ,సూరిశెట్టి కన్నారావు, కె.పి రావు,ఆడారి శ్రీరాములు,పెంటకోట జగన్నాథరావు, వీఆర్వో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాల జ్వరంతో అప్రమత్తం

నిర్లక్ష్యం చేస్తే పశువుల ప్రాణాలకే ముప్పు

**కోటవురట్ల:** రైతుకు పాడి, పంటా రెండూ రెండు కళ్ల లాంటివి. రెండింటిలో దేనిని నిర్లక్ష్యం చేసినా నష్టం తప్పదు. పాడి పశువుల సంరక్షణలో తగు జాగ్రత్తలు పాటిస్తే నష్టం నుంచి తప్పించుకోవచ్చు. సకాలంలో వ్యాధులను గుర్తించడం ద్వారా నష్టాన్ని నివారించవచ్చు. ప్రధానంగా పాడి పశువుల్లో శీతాకాలం వచ్చే పాల జ్వరాన్ని నిర్లక్ష్యం చేస్తే నష్టం తప్పదు. పాల జ్వరం లక్షణాలు, నివారణ, చికిత్స గురించి పశు సంవర్థక శాఖ ఏడీ పెట్ల నరేష్ వివరించారు. మండలంలో 17 వేల పశువులున్నాయని, పాల జ్వరం గుర్తించిన వెంటనే తగిన చికిత్స చేస్తున్నామని ఆయన చెప్పారు.

ఈనిన మొదటి వారంలోనే పాడి గేదెలు, ఆవుల్లో ఈవ్యాధి కనిపిస్తుంది. అధిక పాల ఉత్పత్తి ఉన్న పశువుల్లో పాల జ్వరం ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. సాధారణంగా చాలా మంది రైతులు ఈనిన వెంటనే పాలను పితికేస్తారు. అలా చేయడం వల్ల కూడా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ఈ వ్యాధి కాల్షియం లోపం కారణంగా వచ్చే అవకాశం ఉంది. జున్నుపాలు, సాధారణ పాలను అధికంగా పితకడం వల్ల పశువు శరీరంలోని కాల్షియం శాతం తగ్గిపోవడంతో ఈ జ్వరం వస్తుంది.



పాడి గేదెలు

**నివారణ ఇలా..** ఈనిన వెంటనే పశువుల పొదుగును శుభ్రం చేయాలి. పొదుగు నుంచి మొత్తం పాలను పితకకూడదు. పశువు చూడితో ఉండగానే లేదా ఈనిన తర్వాత డాక్టరును సంప్రదించి సలహా మేరకు కాల్షియం, మెగ్నీషియం ఖనిజ లవణాలు తగు మోతాదులో ఇవ్వాలి.

**వ్యాధి లక్షణాలు..**

పశువులు తలను డొక్కలో పెట్టుకుని పడుకుంటాయి. బాగా నీరసించిపోయి మేత మేయడం మానేస్తాయి. ఈ వ్యాధి సోకిన పశువులు ఎక్కువగా కింద పడిపోవడం, తన్నుకోవడం చేస్తాయి. కండరాలు వణకడం కనిపిస్తుంది. కళ్ల నుంచి నీరు కారుతూ, చెవులు వాచిపోతాయి. కొన్ని పశువుల్లో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే చూపు మందగిస్తుంది. పశువు చిరాకుగా ఉండి ఉలిక్కిపడుతూ ఉంటుంది. ఈ వ్యాధి పట్ల అశ్రద్ధ చేస్తే పశువులు మరణించే ప్రమాదం ఉంది.

**చికిత్స...** వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వీలైనంత తొందరగా డాక్టరును కలిసి కాల్షియం ఇంజక్షన్లు వేయించాలి. ముందుగానే తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి బారిన పడకుండా పశువును కాపాడుకోవచ్చు.

## చురుగ్గా అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణం



నిర్మాణంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం

**ఎస్.రాయవరం:** మండల కేంద్రం ఎస్.రాయవరంలో దాతల విరాళాలతో చేపట్టిన అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణం చురుగ్గా సాగుతున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో పినపాత్రుని దొరయ్య కుటుంబ సభ్యులు రూ.50 లక్షల విలువ చేసే సుమారు 16 సెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇవ్వడంతో విరాళాలతో ఆలయాన్ని నిర్మించేందుకు గ్రామస్తులు ముందుకు వచ్చారన్నారు.సుమారు రూ.1.25 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఆలయ నిర్మాణం 40 శాతం పూర్తయిందని చెప్పారు. మొదటి శ్లాబ్ నిర్మించినట్టు చెప్పారు. ఈ ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేసేందుకు పలువురు భక్తులు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఆధునిక హంగులతో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ ఆలయ నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్కోజు ఆదిమూర్తి, ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు,యల్లపు నాగు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందు

## న్యాయ వ్యవస్థపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి పి విజయ

**యలమంచిలి రూరల్:** మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఉచితంగా న్యాయం పొందగలిగే విధానాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ అన్నారు.నేషనల్ లీగల్ సర్వీస్ డే సందర్భంగా శనివారం రాత్రి స్థానిక న్యాయస్థానంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమాజంలోని బడుగు,బలహీన,నిరుపేద వర్గాలకు ఉచిత న్యాయ సేవలను అందించడానికి, వివాదాలను సామరస్యంగా పరిష్కరించడానికి లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987 కింద కల్పించిన సదుపాయాలను ఆమె వివరించారు.సమాజంలో ఇప్పటికీ న్యాయవ్యవస్థను సంప్రదించాలంటే కొందరు భయపడతారని చెప్పారు. లాయర్లకు బోలెడంత డబ్బు ఫీజుగా ఇచ్చుకోలేమనో,తిరగలేమనో కోర్టులకు వెళ్లేందుకు ముందుకు రావడం లేదని చెప్పారు. అలాంటి వారికి ఈ చట్టం ప్రకారం ఉచిత న్యాయసేవలు పొందే వీలుందన్న విషయాన్ని తెలియజేయడం, అవగాహన కల్పించడమే ఈ సమావేశం లక్ష్యంగా ఆమె తెలిపారు.లోక్ అదాలత్‌లను కూడా నిర్వహించడం ఈ చట్టంలో భాగమని ఆమె పేర్కొన్నారు. సమస్య వచ్చినప్పుడు స్థానికంగా మండల,జిల్లా,రాష్ట్ర స్థాయిల్లో ఉన్న లీగల్ సర్వీస్ అథారిటీని సంప్రదించి న్యాయ సలహా పొందవచ్చని ఆమె చెప్పారు.ఈ కార్యక్రమంలో ప్యానెల్ లాయర్లు,స్థానికులు,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



నేషనల్ లీగల్ సర్వీస్ డే సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సు

### అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి

**మునగపాక:** అసాంఘిక కార్యకలాపాల నివారణపై దృష్టి సారించాలని స్థానిక ఎస్ఐ పి.ప్రసాదరావును పరవాడ డీఎస్పీ సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. స్టేషన్‌లో సిబ్బంది వివరాలతో పాటు రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చే అర్జీదారులకు సకాలంలో సేవలందించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని, పేకాట,అనధికార మద్యం విక్రయాలపై దృష్టి సారించాలని ఆదేశించారు.

### 11న గణపర్తిలో గ్రామ సభ

**మునగపాక:** మండలంలోని గణపర్తిలో ఈ నెల 11న రెవెన్యూ గ్రామసభ జరుగుతుందని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సభను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.